క్లుప్తంగా

పేదలకు ఆరోగ్య భరోసా



కల్వకుర్తి రూరల్: నియోజకవర్గ పరిధిలోని పేదల ఆరోగ్యానికి భరోసా ఇచ్చేందుకు ఐక్యత ఫౌండేషన్ కృషి చేస్తుందని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చల్లంపల్లిలో వైద్య శిబిరం నిర్వహించారు. 300 మంది గ్రామస్తులకు శిబిరంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. సురేందర్ రెడ్డి, మాధవరెడ్డి, తిరుపతిరెడ్డి, పర్వతాలు యాదవ్, నరేందర్, అమర్నాథ్, శ్రీశైలం గౌడ్, వెంకటేష్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తీర్చాలి



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైపులైన్ అపోలో ఫార్మసీ వద్ద మరమ్మతు చేస్తుండగా పైపులైన్ పగిలింది. వారం రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు సరఫరా కాక దీపావళి పండుగ పూట ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పుడు, ఇప్పుడు అంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పండుగ సందర్భంగా తాగునీటి ఇబ్బందులు తీర్చకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా పగిలిపోయిన పైప్‌లైన్‌ను మరమ్మతులు చేయకుండా చోద్యం చూస్తున్నారు. పైపులైన్‌ను మరమ్మతులు చేసి తాగునీటి ఎద్దడిని తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మార్చాలలో గ్యార్వీ

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాలలో ఆదివారం గ్యార్వీ షరీఫ్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు దర్గాలో ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కాయతి విజయకుమార్ రెడ్డి, ఆనంద్ కుమార్, శ్రీధర్ రెడ్డి, మదన్ మోహన్ రావు, నిజాముద్దీన్, ఖాజా మైనుద్దీన్, భాస్కర్ రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు



కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాలా నుంచి జీడిపల్లి వెళ్లే బీటీ రోడ్డు భారీ వర్షాలకు గుంతలమయంగా మారి రోడ్డుకు ఇరువైపులా మట్టి కొట్టుకుపోయింది. బీజేపీ నాయకులు బండల రామచంద్రారెడ్డి, పి కృష్ణారెడ్డిలు స్పందించి ఆదివారం ట్రాక్టర్ల ద్వారా మట్టి, మొర్రం తీసుకొచ్చి రోడ్డుపై గుంతలు పూడ్చి, పక్కన మట్టిని పోయించారు. వాహనదారులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మెడికల్ కిట్లు అందజేత



తెలకపల్లి: మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మండల అధ్యక్షుడు చింత కృష్ణయ్య ఆధ్వర్యంలో మండల విలేకరులకు ఆదివారం మందుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల ఆరోగ్యానికి ఐజేయూ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. సమావేశంలో శంకర్, శివ, భాషమోని రమేష్, మల్లేష్, శ్రీనివాసులు, వెంకటేష్, సాయి, సాంబశివుడు, రాఘవేందర్, భరత్‌కుమార్‌రెడ్డి, పరమేష్, ఎల్లస్వామి, మీసాల కృష్ణయ్య పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు

తెలకపల్లి: మండలంలోని కారువంగలో 9వ వార్డులోని చెన్నకేశవ గుడి పక్కన మురికి కాల్వలు లేక రోడ్డుపై మురుగు పారుతోంది. రోడ్డుపైనే మురుగు నిల్వ ఉండడంతో దుర్గంధ వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమలకు నిలయంగా మారడంతో రోగాలబారిన పడుతున్నామని పలువురు వాపోయారు. పాలకులు, అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది పరిశీలించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. సమస్య పరిష్కరించకపోతే ప్రజావాణిలో కలెక్టర్ దృష్టి తీసుకెళ్తామని పేర్కొన్నారు.



ఇరుకు రహదారితో ఇబ్బందులు

- శ్రీశైలం వెళ్లే భక్తులకు తప్పని తిప్పలు



టోల్‌గేటు వద్ద ఇరుకుగా ఉన్న రోడ్డు



మన్ననూర్‌లో ఇరుకు రోడ్డులో ఇబ్బందిగా వెళ్తున్న వాహనాలు

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి పల్లె రోడ్లను తలపిస్తోంది. రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ రహదారి గుండా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రతి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు చేస్తుంటారు. ఈ జాతీయ రహదారి సుమారు 50 కిలో మీటర్లు ఘాటు రోడ్లు, మలుపులు, దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో పాటూ ఎక్కువ మొత్తంలో అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం పరిధిలో ఉండటం విశేషం. నాలుగు లైన్లుగా ఉండాల్సిన ప్రధాన రహదారి అటవీశాఖ ఆంక్షలతో డబుల్ రోడ్డుకు మాత్రమే పరిమితమైంది. దీంతో ఈ రహదారి గుండా రాకపోకలు చేస్తున్న వాహనాలు తరుచుగా రోడ్డు ప్రమాదాలకు గురి కావడంతో పాటూ అప్పుడప్పుడు అటవీ సరిహద్దు ప్రాంతంలో వన్యప్రాణులు రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నాయి. ఇదిలా ఉంటే టోల్‌గేట్ ఏర్పాటు చేసి వాహనదారుల నుంచి ప్రతి నిత్యం రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. తిరుగు ప్రయాణంలో వాహనాలకు దారిలేక సైడు మట్టిలో నుంచి వెళ్లడం గమనార్హం. ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అటవీశాఖ విఫలం అయ్యిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ రహదారిగుండా ప్రయాణించాలంటేనే భక్తులు, పర్యాటకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి రహదారి విస్తరణకు మార్గం సుగమం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డ దాటే పరిస్థితి లేదు



ప్రభుత్వ సెలవు దినాలలో రోడ్డు దాటే పరిస్థితి లేదు. శుక్ర, శని, ఆదివారాలలో రద్దీ ఎక్కువగా ఉంటోంది. హైదరాబాద్‌ను తలపించే విధంగా వాహనాలు ఇరువైపులా నుంచి బారులు తీరి రాకపోకలు కొనసాగుతాయి. మన్ననూర్, వటువర్లపల్లి గ్రామాలలో పార్కింగ్ చేసుకునే పరిస్థితి లేక వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. పాదాచారులు నడిచేందుకు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు వెడల్పు చేస్తే బాగుంటుంది.

–సంబు శ్రీనివాసులు, మన్ననూర్

త్వరలోనే పనులు చేపడతాం



శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన జాతీయ రహదారి కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉంటుంది. అటవీ శాఖ నిబంధన కారణంగా రోడ్డు వెడల్పు, మరమ్మతులకు ఆటంకాలు కలుగుతున్నాయి. హాజీపూర్ నుంచి మన్ననూర్ దుర్వాసుల చెరువు వరకు నాలుగు లైన్ల రోడ్డు మంజూరు అయ్యింది. త్వరలోనే పనులు ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. ఈ రహదారిలో నిర్మాణం పూర్తైతే వాహనాల రద్దీ తగ్గుతోంది.

– డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, అచ్చంపేట ఎమ్మెల్యే

కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థినులతో మాస్టర్ ముఖేష్

లింగాల: ఖేలో ఇండియాలో భాగంగా రాష్ట్ర స్థాయి బాలికల విభాగంలో శనివారం మహబూబ్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అస్మిత్ కిక్ బాక్సింగ్ 2025–26 లీగ్‌లో ముఖేష్ అకాడమీకి చెందిన నలుగురు విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 5వ తరగతి చదువుచున్న రష్మిక 30 కేజీల చిల్డ్రన్ ఫైట్ విభాగంలో ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించగా ఇదే విభాగంలో దీక్షిత ప్రతిభ కనబర్చి రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించారు. సృజన, హర్షిత కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, రవినాయక్ విజేతలకు పతకాలతో పాటు ప్రశంసాపత్రాలను ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ అకాడమీ నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు మాస్టర్ ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు అండగా ఉంటాం



కార్యకర్తలకు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. వివిధ శాఖల్లో ఉద్యోగం సాధించిన ఉద్యోగులను ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగుల సమస్యలు తీరాయన్నారు. అనంతరం పట్టణంలోని 8వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అప్పశివ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబునాయక్, రేణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరిస్తా

బల్మూర్: గ్రామ దేవతల పండుగలు ఐక్యతకు నాందిగా నిలుస్తాయని ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండలంలోని కొండనాగులలో నూతనంగా నిర్మించనున్న పోచమ్మతల్లి దేవాలయ నిర్మాణానికి ఆయన ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని, తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీపతిరావు, డీసీసీ ప్రధాన కార్యదర్శి కాశన్నయాదవ్, మండల ఉపాధ్యక్షుడు మశన్న, నాయకులు ఎల్లికంటి శ్రీనువాసులు, బుచ్చన్న, రామస్వామిగౌడ్, సంపంగి రమేష్, మహమ్మద్, అశోక్, సుభాష్, శంకర్‌గౌడ్, పద్మ, నారమళ్ల బుచ్చన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పథ సంచాలన్



కల్వకుర్తిలో పథ సంచాలన్ నిర్వహిస్తున్న స్వయం సేవకులు



వెల్దండలో..

కల్వకుర్తి రూరల్: ఆర్ఎస్ఎస్ 100వ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం కల్వకుర్తిలో ఆర్ఎస్ఎస్ పథ సంచాలన్ నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి పట్టణ పురవీధుల కొనసాగింది. గణవేష్‌తో స్వయం సేవకులతో ఆకట్టుకున్నారు. పలుచోట్ల కార్యకర్తలకు ఘన స్వాగతం పలికారు. కట్టా ప్రభాకర్, బోగరాజు రాము, ఆంజనేయులు, అరవింద్, హరిప్రసాద్‌చారి, వంశీకార్తీక్, బొట్టురాజు, కిషోర్, శివజగదీశ్వర్ పాల్గొన్నారు.

హిందుత్వం మతం కాదు జీవన విధానం

వెల్దండ: హిందుత్వం మతం కాదు జీవన విధానమని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఖండ చాలకులు బావండ్ల అంజయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆర్ఎస్ఎస్ 100వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో భరతమాత, హెడ్గేవర్, గురూజీ చిత్రపటం, కాషాయ ధ్వజంతో స్వయం సేవకులు ప్రధాన వీధుల గుండా పథ సంచాలన్(ర్యాలీ) నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ సామాజిక సామరస్యత, కుటుంబం విచ్ఛినం కాకుండా నివారణ చర్యలు, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ జీవన విధానం, సమాజాన్ని ర క్షించడం పంచ పరివర్తనతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ముందుకు వెళ్తుందన్నారు. మత మార్పిడికి పాల్పడేవారు దేశ ద్రోహులన్నారు. దేశ సమగ్రతే లక్ష్యంగా స్వయం సేవకులు నిస్వార్థంగా నిక్కచ్చికగా పనిచేస్తున్నారన్నారు. వేణుగోపాల్‌చారి, రాజకుమార్, శ్రీధర్, పాండు, ఉమేష్, మల్లేష్, దేవేందర్, రాజు, బీజేపీ నాయకులు శేఖర్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీను, చక్రవర్తిగౌడు, కృష్ణారెడ్డి, వెంకట్‌రాములు, తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



విద్యార్థులను ఇంటికి పంపిస్తున్న ఏబీవీపీ నాయకులు

కందనూలు: సెలవు రోజులలో తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులో గల ఓ ప్రైవేటు పాఠశాల తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలుసుకొని ఏబీవీపీ నాయకులు పాఠశాలకు చేరుకొని విద్యార్థులను ఇంటికి పంపించారు. అనంతరం ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ ఆదివారం సెలవు రోజులలో తరగతులు నిర్వహించడం సరైంది కాదని, విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రసాద్‌కుమార్, కేలో భారత్ కన్వీనర్ రమేష్, నగరసంయుక్త కార్యదర్శి మల్లేష్‌యాదవ్, తదితరలు పాల్గొన్నారు.

బీజేపీతోనే పేదల సంక్షేమం



మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

బిజినేపల్లి: బీజేపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గువ్వల బాలరాజు మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 14 ఎమ్మెల్యే స్థానాలతో పాటు 2 ఎంపీ స్థానాలను కూడా బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత పదేళ్లలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించాయన్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్క కొత్త ప్రాజెక్టు కూడా తీసుకరాలేదని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ తీసుకుంటున్న నిర్ణయాలను ప్రపంచ దేశాలు ప్రశంసిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో రోజురోజుకు బీజేపీకి ఆదరణ పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు దిలీపాచారి, బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మండల నాయకులు భూషయ్య, శివకుమార్, శ్రీరామ్, చంద్రకళ, తిరుపతయ్య, నారాయణాచారి, సత్యానారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణానది తీరాన పర్యాటకుల సందడి

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్టలో కృష్ణానది తీరాన పుష్కరఘాట్ దగ్గర పర్యాటకుల సందడి పెరిగింది. ఆదివారం కావడంతో ఎంతో మంది పిల్లలు, యువకులు చుట్టు పక్కల పలు ప్రాంతాల నుంచి ప్రజలకు అక్కడకు చేరుకొని కృష్ణానది అందాలను తిలకించారు. నిండుకుండలా కృష్ణానది ప్రవహిస్తుండడంతో పర్యాటకులు పెద్ద ఎత్తున వచ్చి వీక్షిస్తున్నారు.



కృష్ణానది తీరాన పర్యాటకుల సందడి

శిథిలావస్థలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. 40 సంవత్సరాల కిందట నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంలోని పైకప్పు పెచ్చులూడిపడి సీకులు తేలాయి. పెచ్చులూడిపడుతున్నా గదుల్లో వైద్య సిబ్బంది రోగులకు వైద్యం అందిస్తూ బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఆస్పత్రిలో వైద్యం చేయించుకునేందుకు రోగులు భయాందోళనకు గురవుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

చట్టసభల్లో రిజర్వేషన్ అమలు చేయాలి



తాడూరు: బీసీలకు చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో చట్టం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కాశన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాకుండ బీజేపీ అడ్డుకుంటుందని ఆరోపించారు. అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీల మద్దతు ఏకగ్రీవంగా ఆమోదించి బిల్లును ఏకగ్రీవంగా పంపించిందన్నారు. 6 నెలలు అయిన కేంద్రం స్పందించలేదని విచారం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ప్రభుత్వం జీఓ 9ని విడుదల చేసిందన్నారు. రిజర్వేషన్లు అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటస్వామి, రాములు, చంద్రయ్యలు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



బల్మూర్: మండలంలోని తుమ్మెన్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం మండలంలోని కనకాల మైసమ్మ ఆలయం వద్ద సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మూడు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో ఆత్మీయంగా పలకరించుకున్నారు. తమ చిన్ననాటి స్నేహితుడు ప్రస్తుతం రాష్ట్ర సీఎం ప్రవాసి ప్రజావాణి కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న బొజ్జ అమరేందర్‌రెడ్డిని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లయ్య, బాల్‌చంద్రారెడ్డి, యాదగిరిరావు, నిరంజన్‌రావు, నిరంజన్, ఎల్లారెడ్డి, రజాక్, పూర్వ విద్యార్థులు వెంకటయ్య, నరసింహ, వెంకటేష్, తిరుపతయ్య, కృష్ణ, గోపాల్ రెడ్డి, రామేశ్వరరావు, రవిప్రసాద్, ప్రభాకర్‌రావు, జాహంగీర్, లక్ష్మయ్య, మాధవరెడ్డి, ఉస్మాన్ పాల్గొన్నారు.

రిజర్వేషన్ అమలయ్యేవరకు ఉద్యమిస్తాం



కల్వకుర్తి రూరల్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే వరకు ఉద్యమం ఆపేది లేదని బీసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి పాలమూరు చౌరస్తా వరకు నల్ల కండువాలు ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ బీసీలకు అన్ని పార్టీలు మద్దతు తెలపడం సంతోషకరమన్నారు. రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ కన్వీనర్ రాజేందర్, సదానందం గౌడ్, గోపాల్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి సిమెంట్ వితరణ

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన ఎల్లమ్మ ఇంటి నిర్మాణం మధ్యలో నిలిచింది. నిర్మాణానికి సహకరించాలని గ్రామ బీఆర్ఎస్ నాయకులు మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఎల్లమ్మ ఇంటి నిర్మాణానికి ఆదివారం 20 సిమెంట్ బ్యాగులను పంపించారు. పార్టీ నాయకుడు గణేష్ సిమెంటును కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుశీల, కేశవులు, రవి, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై బైఠాయింపు

అమ్రాబాద్: గత ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు వేసిన శిలాఫలకాన్ని ఆదివారం గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు తొలగించాడని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు పదర అమ్రాబాద్ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తుల మధ్య చిచ్చుపెట్టేందుకు శిలాఫలకాన్ని తొలగించారన్నారు. అధికారులు స్పందించి కాంగ్రెస్ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రామస్వామి, శ్రీనివాసులు, బాల్ నారాయణ, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

పైపులైన్ లీకేజీని సరిచేయాలి



తాడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం దగ్గర మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అయ్యింది. నెల రోజులు గడుస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శించారు. ప్రభుత్వ కార్యాలయాల దగ్గర ప్రహరీ అనుసరించుకొని ఉన్న లీకేజీ సరిచేయాలని అధికారుల విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.